క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

నందలూరు(రాజంపేట) : మండలంలో విద్యుత్ మెయింటెనెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ మురళీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట 132 కేవీ మరమ్మతులు నిర్వహించడంతో మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు నిర్వహించడంతోపాటు విద్యుత్ తీగలపై ఉన్న చెట్లను తొలగిస్తున్నామన్నారు. కావున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

20న డయల్ యువర్ ఆర్టీసీ

రాయచోటి అర్బన్ : ఈ నెల 20న జిల్లా పరిధిలోని ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రాము ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణీకులు తమ సలహాలు, సూచనలతో పాటు తాము ఎదుర్కొంటున్న సమస్యలను 8955283211 నంబరుకు కాల్ చేసి తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

22న శోభాయాత్ర

గాలివీడు : అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈనెల 22న గాలివీడులోని గేటు వద్దనున్న రామాలయం నుంచి భక్తుల ఆధ్వర్యంలో భారీ శోభాయాత్రను చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం శోభాయాత్ర గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 22న ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం నుంచి శ్రీరామ శోభాయాత్ర ఉత్సవమూర్తులను చెక్కభజనలు, కోలాటాలు, కళాకారుల వేశధారణలు, బాణాసంచా నడుమ పురవీధుల్లో భారీ ఊరేగింపు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

29న మండల సమావేశం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

విగ్రహావిష్కరణకు తరలివెళ్లారు



విగ్రహావిష్కరణకు వెళ్లిన రామాపురం వాసులు

రామాపురం : విజయవాడ నగరంలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగంగా మండలానికి చెందిన నాయకులు, ప్రజలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుంచి బస్సులను ఏర్పాటు చేయడంతో దాదాపు మండలం నుంచి 400 మంది వెళ్లినట్లు తెలుస్తోంది. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరంగా ఉందని మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

రాజంపేట టౌన్ : మండలంలోని బోయినపల్లె గ్రామానికి చెందిన ప్రజలు చేపట్టిన 18వ తిరుమల పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. బోయినపల్లెలోని భావనారుషి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా మార్గమధ్యలో ఉన్న అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద భక్తులు పూజలు జరిపారు. అనంతరం పాదయాత్ర పట్టణంలోని మన్నూరు మీదుగా సాగింది.

కోనేరుకు మరమ్మతులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు పంచాయతీలోని కొత్తపల్లి వినాయక మండలం వద్ద కోనేరును తెల్లరాతితో ఏర్పాటు చేస్తున్నట్లు వినాయక కమిటీ సభ్యులు తెలిపారు. కొత్తపల్లికి చెందిన తలమంచి గిరీష్ రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాదాపు రూ. 25 లక్షలతో కోనేరును నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కోనేరు దాదాపు 200 సంవత్సరాల క్రితం అప్పట్లో ఏర్పాటు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కోనేరు పూడిపోవడంతో గిరీష్ రెడ్డి కలికిరి నుండి కోనేరు రాళ్లు తీసుకువచ్చి ఈ కోనేరు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాయచోటి టౌన్ : అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మద్యం షాపు నుంచి గుర్రప్పగారిపల్లె వండెపల్లె గ్రామస్తుడు తొమ్మిది మద్యం బాటిళ్లు తీసుకొని వెళుతుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి గ్రామంలో ఎక్కువ ధరలకు విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

– విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ



చిట్వేలి: భాకరాపురం సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ తదితరులు

చిట్వేలి : నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ సూచించారు. శుక్రవారం చిట్వేలి సబ్ స్టేషన్, భాకరాపురం సబ్ స్టేషన్ తదితర ప్రాంతాలలో ట్రాన్సుఫార్మర్లు, లైన్లను ఆయన పరిశీలించారు. అనంతరం చిట్వేలి సబ్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పగటిపూట వీధిలైట్లు వెలిగితే సహించబోమని హెచ్చరించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్సుఫార్మర్లు ఏర్పాటు చేయడం, లైన్ల వెంబడి తిరిగి తప్పులను గుర్తించి మరమ్మతులు చేయడం, రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్సుఫార్మర్ల ఫీజులు మార్చడం, కాలిపోయిన ట్రాన్సుఫార్మర్లను మార్చడం వంటి వాటిపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను యుద్ధప్రాతిపదికన మార్చాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. వ్యవసాయ పొలాలకు హై ఓల్టేజీ విద్యుత్ ద్వారా విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, తద్వారా అంతరాయాలు ఏర్పడడమే కాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రజలను చైతన్యవంతులను చేసి విద్యుత్ కంచెలను నిర్మూలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఈఈ రాజశేఖర్ రెడ్డి, రైల్వేకోడూరు సబ్ డివిజన్ డీఈఈ భాస్కర్ రావు, చిట్వేలి ఏఈ వెంకటాచలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి సారించండి

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాతోపాటు ఎటువంటి సమస్యలు తలెత్తినా తక్షణమే వాటి పరిష్కారంలో చొరవ చూపండంటూ విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.రమణ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో ఎస్ఈ సమీక్ష నిర్వహించారు. రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులను జాప్యం లేకుండా విడుదల చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ వృథాపై దృష్టి సారించి అరికట్టేందుకు చొరవ చూపాలన్నారు. పగటి పూట వీధి దీపాలు వెలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. విద్యుత్ చౌర్యంను అరికట్టడంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డీఈఈలు, వివిధ మండలాల ఏఈలు, జేఈలు, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలు



మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి

సంబేపల్లె : మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపీపీ నాగశ్రీలక్ష్మి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోతే ఎలా అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రానున్నది వేసవికాలం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో నీటి ఎద్దడి రాని వ్వకూడదన్నారు. మండలంలో రెగ్యులర్ అధికారులు లేరని, ఇన్‌చార్జ్‌గా ఉన్న అధికారులు సైతం సమావేశాలకు గైర్హాజరు అయితే అభివృద్ధి పనులపై చర్చ, సమస్యల పరిష్కారానికి చర్యలు ఎవరు తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. హాజరైన అధికారుల సమక్షంలో సమస్యలపై చర్చించారు. వేసవికాలం వస్తుందని, ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిశాయని, తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అందరి సమష్టి కృషితో మండలం అన్ని విధాల అభివృద్ధి చేద్దామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జాబీర్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ పాలకులు బకాయిల చెల్లింపునకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు హఫీజుల్లా, రఫీ, చంద్రశేఖర్ రెడ్డి, కిఫాయతుల్లా, ముని, సుధాకర్, ఉమాశంకర్, నాగార్జున, అమీనుల్లా, ఫయాజ్, ఇమ్రాన్, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లూరమ్మకు పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఆలయ అర్చకులు అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

పోస్టులను భర్తీ చేయండి



డాక్టర్ ఇక్బాల్‌కు వినతిపత్రం అందిస్తున్న రూటా నేతలు

రాయచోటి అర్బన్ : త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ ద్వారా ఉర్దూ మీడియం పాఠశాలల్లోని ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులన్నింటిని భర్తీ చేయించాలని ఏపీ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్ ఖాన్‌ను రూటా నేతలు కోరారు. శుక్రవారం ఉదయం రూటా నేతలు కలికిరి మండలం మహల్ గ్రామంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్ ఖాన్‌ను కలిశారు. పోస్టుల భర్తీ కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

అరటిలో తెగుళ్ల నివారణ చేపట్టండి



వైకోట గ్రామంలో అరటి రైతులకు సూచనలు ఇస్తున్న వైఎస్సార్ ఉద్యాన కళాశాల శాస్త్రవేత్తలు

ఓబులవారిపల్లె : అరటిలో పోషక లోపం, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు సీహెచ్ రూత్, డాక్టర్ కె.స్వరాజ్యలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం వైకోట గ్రామంలో అరటి తోటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ జీ–9 రకానికి చెందిన అరటి మొక్కలకు పోషక లోపాలు, పండుటాకు తెగులు, ఆకు చివరన కుళ్లడం తదితర సమస్యలను గుర్తించారు. రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వలన అరటి గెలలు రావడానికి ఆలస్యమవుతుందన్నారు. పోషక లోపం నివారణకు 13 - 0.45(పొటాషియం నైట్రేట్)ను గెలలకు పిచికారీ చేయాలని సూచించారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడటం రైతులు అలవరుచుకోవాలని సూచించారు. పండుటాకు తెగులు నివారణకు ప్రొఫికీన జోల్ ఒక మిల్లీ లీటరు లీటరు నోటిలో కలిపి తెగులు సోకిన ఆకులకు పిచికారీ చేయాలన్నారు. అనంతరం అరటి సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల అనంతరాజుపేట అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీలత, విద్యార్థులు, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై, ఏపీఎండీసీ ముఖద్వారం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. గత నెలరోజులుగా ఏపీఎండీసీ ఆర్చిగేటు వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న గ్రామాల ప్రజలకు, వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో విద్యుత్ దీపాలు లేనందున ఈ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగి చాలా మంది మృతి చెందారు. ఏపీఎండీసీ నుంచి వచ్చే వాహనాలు, జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఏపీఎండీసీ ముఖద్వారం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ గెలుపునకు దోహదపడాలి



ఆకేపాటిని సత్కరిస్తున్న గల్ఫ్ వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రవాసాంధ్రులు దోహదపడాలని గల్ఫ్ కన్వీనరు బీహెచ్ ఇలియాస్, యూఏఈ వైఎస్సార్‌సీపీ సలహాదారు రెడ్డయ్యరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆకేపాటి ఎస్టేట్‌లో జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త ఆకేపాటి అమరనాథరెడ్డిని మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మర్రి ఆధ్వర్యంలో కలిసి సత్కరించి, గల్ఫ్ ప్రవాసాంధ్రుల తరపున మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కువైట్ వైఎస్సార్‌సీపీ బీసీ ఇన్‌చార్జి రమణయాదవ్, ఎన్‌ఆర్‌ఐలు వెంకటసుబ్బయ్య, కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కె.మణిలు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహణలో ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసదాన్ని అందజేశారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

త్వరలో అందుబాటులోకి కొత్త బస్సులు



మాట్లాడుతున్న రాజారెడ్డి

రాయచోటి అర్బన్ : ఆర్టీసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఎం జగనమోహన్‌రెడ్డిదే అని ఏపీఎస్ఆర్టీసీ డైరెక్టర్ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి బస్టాండులోని ఆర్ఎం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనాలోనూ ఆర్టీసీ ఉద్యోగులకు కచ్చితంగా జీతాలు చెల్లించింది ఒక్క జగనన్న ప్రభుత్వమే అన్నారు. ప్రయాణీకులకు సురక్షితమైన, విలాసవంతమైన ప్రయాణం కోసం 1000 ఎలక్ట్రికల్ బస్సులు, 1500 డీజిల్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్న ట్లు తెలిపారు. ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని 2024–25లో రూ. 500 కోట్లకు పైగా పెంచేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడారన్నారు. సీఎం జగనన్నకు అందరం అండగా ఉందామంటూ ఆయన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను కోరారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా ఆర్ఎం రాము పాల్గొన్నారు.

సంతాపం

రాయచోటి అర్బన్ : 19వ వార్డు వైఎస్ఆర్‌సీపీ కౌన్సిలర్ జయన్ననాయక్ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్ తదితరులు జయన్న నాయక్ స్వగ్రామమైన సుండుపల్లె మండలంలోని పెద్దబిడికికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత



రోగులకు మందులను అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యతను కల్పించిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఆయా గ్రామాల్లోని సచివాలయ కేంద్రాల్లో వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇక్కడ అందుబాటులో లేని మందులను సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి పోస్టల్ ద్వారా తెప్పించి సీహెచ్ఓ, ఏఎన్ఎంల ద్వారా ఆయా పేషంట్ల ఇంటికి పంపుతామన్నారు. అలాగే ఇక్కడ చికిత్స అందించ లేని రోగులను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి, సంబంధిత ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేస్తారన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి చూపు లోపమున్న వారికి కంటి అద్దాలను 20 రోజుల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైద్యాధికారులు శివకుమార్ జనరల్, చిన్నపిల్లల డాక్టర్ సుప్రజారెడ్డి, ఈఎన్‌టీ డాక్టర్ షైనీ షారోన్, ఆప్తాల్మిక్ కిరణ, సూపర్‌వైజర్లు నాగవల్లి, జ్యోతికళ, జయమ్మ, ఏపీఎం వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, నాగరత్నమ్మ, గ్రామ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణం తిలకిస్తున్న మహిళలు

పుల్లంపేట : పుల్లంపేటలోని శివాలయంలో శుక్రవారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు, భక్తులు ఆలయానికి చేరుకొని వేడుకను తిలకించారు. ప్రతి ఏడాది నరసింహకుమార్ పాదయాత్ర అనంతరం పెంచలకోనకు పాదయాత్ర చేయడం ఆనవాయితీ. కాగా శనివారం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పాదయాత్ర ప్రారంభం కానుంది. పెంచలకోనకు చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించనున్నారు.

అయోధ్య అక్షింతలు ఇంటింటా పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట టౌన్ : అయోధ్య నుంచి వచ్చిన రాములవారి అక్షింతలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విస్తృతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని అయోధ్య నుంచి వచ్చిన రాములవారి చిత్రపటం, అక్షింతలను హిందువులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, పట్టుపోగుల ఆదినారాయణ, అందిరాజు గుణవర్మ, సూర్యచంద్ర, జీకే నాగరాజు, ప్రవీణ్, వినోద్‌కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు రాజంపేటలో శోభాయాత్ర

ఈనెల 22వ తేదీ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8:30 గంటల నుంచి రాజంపేట పట్టణంలో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు శ్రీ రామభక్త సేవా సమితి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్ర తిరుపతి రోడ్డులోని వాసవీ మాత వనం (జమ్మిచెట్టు) నుంచి ప్రారంభమై పాత బస్టాండు, ఆర్అండ్‌బీ బంగ్లా, ప్రభుత్వాసుపత్రి, నూనెవారిపల్లె రోడ్డు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఆర్ఎస్‌రోడ్డు మీదుగా సాగుతుందన్నారు. ఈ శోభాయాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

‘గుంటూరు కారం’లో విలన్‌ల పేర్లు మార్చాలి



మాట్లాడుతున్న ఎం.అంకన్న

లక్కిరెడ్డిపల్లె : గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి వారి పాత్రలను చెడుగా చూపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జాంద్రపల్లెలో ఆయన మాట్లాడుతూ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన వ్యక్తి అని, శ్రామిక వర్గాన్ని విముక్తి చేయడానికి తమ జీవితాన్ని దారపోశారన్నారు. అలానే కామ్రేడ్ లెనిన్ మార్క్సిజంతో రష్యా దేశంలో విప్లవాన్ని విజయవంతం చేశారన్నారు. అలాంటి మహానేతల పేర్లను గుంటూరు సినిమాలో విలన్‌లకు పెట్టి అవమానించడం తగదన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేష్ బాబులు బహిరంగ క్షమాపణలు చెప్పి వెంటనే ఈ పేర్లను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు స్వరూప్ తేజ్, అరుణ్, మహేష్, వెంకట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను క్లియర్ చేయాలి



లెప్రసీ స్క్రీనింగ్ టెస్టు చేస్తున్న శైలజ

రాయచోటి అర్బన్ : మండలంలోని యండపల్లె పీహెచ్‌సీని శుక్రవారం అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ శైలజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పీహెచ్‌సీలోని పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. ఎల్‌సీడీసీ సర్వేలో పెండింగ్ కేసులను వెంటనే క్లియర్ చేయాలంటూ వైద్య సిబ్బందిని ఆదేశించారు. టీబీ, లెప్రసీ తదితర రోగుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలంటూ సూచించారు. లెప్రసీ అనుమానిత వ్యక్తికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ దేవప్రసాద్, హెచ్ఎస్ వెంకటేశ్వరరెడ్డి సీనియర్ అసిస్టెంట్ దేవేంద్ర, స్టాఫ్ నర్స్‌లు కవిత, ఖాదర్‌బీ, ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర, ఎంపీహెచ్ఏ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రణాళిక తయారుచేయాలి

రాయచోటి అర్బన్ : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీలో అధికారులు పకడ్బందీగా తయారు చేయాలని రాయచోటి ఎంపిడిఓ మల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయచోటి ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీలలో 2024–25 సంవత్సరానికి చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికపై అధికారులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి ప్రణాళికలు తయారు చేసి నివేదికలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సురేష్‌బాబు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యం మరింత విస్తృతం కావాలి



చిట్వేలి: వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మానవత సభ్యులు



రాజంపేట టౌన్: నివాళులర్పిస్తున్న తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు

రాజంపేట టౌన్ : మట్టిలో పుట్టి, మాణిక్యంగా వెలిగిన మహాయోగి, ప్రజాకవి యోగివేమన జీవితం ఆదర్శప్రాయమని తెలుగుభాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లె వెంకటరమణ తెలిపారు. స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో శుక్రవారం సమితి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గంగనపల్లె మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రభావితం చేసిన మహనీయుడు యోగి వేమన అని కొనియాడారు. వేమన సాహిత్యం మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్యాలు రాసి సాహిత్యాన్ని సమాజానికి చేరువ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. యోగివేమన తెలుగు సాహితీ రంగానికి అందించిన పద్యాలు గొప్ప సంపదని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, పీఎల్ఎన్‌వీ ప్రసాదరావు, చీనేపల్లి చెంగయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సంస్థ చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో యోగివేమన జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి మానవత సభ్యులు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కామటం వెంకటేశ్వర్లు వేమన కవితా వైభవాన్ని, భాషాభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో మానవత బాధ్యులు సాయిరాం, మునిరావు, సభ్యులు సుధీర్ రెడ్డి, సురేంద్ర, నవీన్, పంచాయతీ సిబ్బంది నరసింహ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.